క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఎంపీ మోపిదేవి పరామర్శ



రేపల్లెరూరల్: ఆర్మీలో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తూ ఇటీవల మృతి చెందిన సుభాన్‌ఖాన్ కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని కైతేపల్లి పంచాయతీ ఇస్లాంపూర్‌లోని సుభాన్‌ఖాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దేశ రక్షణకై సేవలు అందిస్తూ ఆకస్మికంగా మృతి చెందటం బాధాకరమన్నారు. సుభాన్‌ఖాన్ కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, నాయకులు షేక్ సుభానీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి ఫ్యాన్‌లు వితరణ

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



రేపల్లె రూరల్: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. వసతి గృహానికి ఏడు సీలింగ్ ఫ్యాన్‌లు, 3 కార్పెట్‌లు అందించటంతో పాటు జాతీయ జెండా దిమ్మను నిర్మించి జెండాను ఆవిష్కరించారు. వసతి గృహం ఆవరణంలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సక్సేనా, పావులూరు శివశంకర్ వరప్రసాద్, సాయేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పాత కక్షలతో వ్యక్తిపై దాడి

రేపల్లె రూరల్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై పలువురు దాడి చేసిన సంఘటన మండలంలోని ఊలుపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిబాబు వివరాల మేరకు ఊలుపాలెంకు చెందిన నాగరాజుపై అదే గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు అరవపల్లి సమీపంలో కర్రలతో దాడిచేసి గాయపరిచారన్నారు. నాగరాజు ఆటోలో రేపల్లె వైపుకు వస్తుండగా అరవపల్లి సమీపంలో అడ్డగించి కర్రలతో నాగరాజుపై మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. తీవ్రంగా గాయపడిన నాగరాజును స్థానికులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించినట్లు పేర్కొన్నారు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెనుమర్రు(వేమూరు): షిర్డీ సాయిబాబా 17వ ఆలయ వార్షికోత్సవం వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు స్వామికి కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకం అలంకారం, విశేష పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు హారతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని తెలిపారు.

చర్చి సభ్యులకు పాత్రల పంపిణీ



తెనాలి: స్థానిక ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనాకొండ చర్చిలో ఆదివారం దైవికారాధన కూడిక నిర్వహించారు. సంఘ కాపరి, దైవ జనులు బ్రదర్ ఆనందన్న బైబిల్ నుంచి వాక్యోపదేశం చేశారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తులా సమర్పణ మనసు కలిగి ఉండాలని చెప్పారు. పాల్గొన్న సంఘస్తులకు దైవిక దశమ భాగ పాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు పి.రత్న కుమారి, బ్రదర్ పి.చార్లెస్ వెస్లీ, బ్రదర్ పి. ప్రశాంత్ బాబు, బ్రదర్ ఎస్.సీమోను, సంఘస్తులు పాల్గొన్నారు

గ్రంథాలయంలో తనిఖీ

తెనాలి రూరల్: మండలంలోని పెదరావూరు గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదార సుబ్బరత్నమ్మ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ అధికారి ఎ. రాఘవేంద్ర రావుకు పలు సూచనలు చేశారు. అక్కడి పాఠకులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జన హృదయ నేతకు తీరంతో తీరని బంధం

- పలుమార్లు రేపల్లె తీరంలో పర్యటించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్
- ఆయన చిరునవ్వుల పలకరింపులను గుర్తు చేసుకుంటున్న ప్రజలు, నాయకులు
- నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు



నిజాంపట్నంలో సునామీ అనంతరం నూతనంగా నిర్మించిన పేదల గృహాలను ప్రారంభిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

రేపల్లె రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి రేపల్లె తీరంతో తీరని బంధం ఉంది. వైఎస్సార్ ప్రతిపక్ష నాయకునిగా తీర ప్రాంతంలో పలుమార్లు పర్యటించి ప్రజలకు అత్యంత చేరువయ్యారు. తొలి నుంచి రేపల్లె నియోజకవర్గంలోని పలువురు నాయకులు వైఎస్సార్‌తో ఆత్మీయ బంధం ఏర్పరుచుకున్నారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు మంత్రి మోపిదేవి వెంకటరమణారావు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లిఖార్జునరావులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి దగ్గరగా ఉండేవారు. మోపిదేవి వెంకటరమణారావు మహానేత వైఎస్సార్ కేబినేట్‌లో పలు శాఖల్లో మంత్రి పదవులు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మూడుసార్లు నియోజకవర్గంలో పర్యటించి తీరప్రాంతంపై తనకున్న మక్కువను చాటుకున్నారు. దీంతోపాటు నియోజకవర్గంలోని పట్టణానికి చెందిన ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేల్ రెబ్బాతో పాటు వైఎస్సార్ పేరుపెట్టి పిలిచే నాయకులు పదుల సంఖ్యలో ఉన్నారంటే వైఎస్సార్‌కు తీరప్రాంతంతో ఉన్న బంధాన్ని నిరూపిస్తున్నది. రాజీవ్ పల్లెబాటలో భాగంగా 2009 జనవరి 28వ తేదీన అప్పటి కూచినపూడి, రేపల్లె నియోజకవర్గాలలో పర్యటించిన సందర్భంగా ప్రజలు కురిపించిన పూలవర్షంతో మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పులకించిపోయారు. నేడు ఆయన జయంతిని పురస్కరించుకుని మహానేతను స్మరించుకుంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమౌతున్నారు.



నగరంలో డ్వాక్రా మహిళలకు 75 లక్షల చెక్కును అందిస్తున్న వైఎస్సార్(ఫైల్)



నిజాంపట్నంలో జననేతపై పూలవర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్న ప్రజలు

వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయండి

వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు ఆదివారం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల వారీగా వైఎస్సార్ విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు. ఉదయం 8 గంటలకు చుండూరు, 10 గంటలకు అమృతలూరు మండలం కూచిపూడి, 11 గంటలకు వేమూరు, మధ్యాహ్నం 12 గంటలకు కొల్లూరు, 1గంటకు భట్టిప్రోలులో జరిగే కార్యక్రమాలలో అశోక్‌బాబు పాల్గొననున్నారు. అద్దేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేడు జననేత వైఎస్సార్ జయంతి వేడుకలు

బాపట్ల: బాపట్ల జిల్లాలో జననేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమౌతున్నారు. మహానేత విగ్రహాల వద్ద పాలాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేపట్టారు. బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో స్థానిక మూర్తిరక్షణనగర్ నుంచి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యకర్తలు, నాయకులు ఉదయం 9.30 గంటలకు కోన నివాసానికి చేరుకోవాలని పార్టీ నాయకులు సూచించారు.

నేడు వైఎస్సార్ జయంతి

రేపల్లె రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని చెప్పారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని చందోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. సోమవారం ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి రెడ్డిపాలెం సెంటర్‌లో జరిగే వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా పిట్టువారిపాలెం, కప్పలవారిపాలెం, ఖాజీపాలెం, గోకరాజునల్లిబోయినవారిపాలెం మీదుగా పిట్టలవానిపాలెంలో జరిగే వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

కర్లపాలెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఆదివారం తెలిపారు. కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భారీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏడుకొండలు కోరారు.

దివంగత నేత వైఎస్సార్ జయంతి వేడుకలు

వేమూరు: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వేమూరు మండల పార్టీ అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు చుండూరు మండలం కేంద్రంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు కూచిపూడి గ్రామంలోనూ, 11 గంటలకు వేమూరు మండల కేంద్రంలోనూ, కొల్లూరు మండల కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు, భట్టిప్రోలులో మధ్యాహ్న 1 గంటకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేడుకల్లో నియోజక వర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చల్లా రామ్మోహనరావు, డాక్టర్ బాల కృష్ణమూర్తి

కర్లపాలెం: ప్రతినెలా మొదటి ఆదివారం రామకృష్ణ సేవా సమితిలో ఏర్పాటు చేస్తున్న ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని అవసరమైన వారంతా వినియోగించుకోవాలని పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పేదలైన మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 120 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ మధుమేహ వైద్యులు డాక్టర్ చల్లా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని చెప్పారు. రక్తపోటు వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ప్రశాంత జీవనం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టీవీ.సుబ్బారావు, కార్యదర్శి కాటూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బాపిరాజు, సుబ్బారావు లలితబాబు, విజయ్‌కుమార్, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

భట్టిప్రోలు: ఉపాధి హామీ ద్వారా అమలవుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ పి. సుధీర్ కుమార్ సూచించారు. 5 ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ అనుసంధాన పనులను వినియోగించుకోవచ్చునన్నారు. పండ్లు, పూలు, మునగ, మల్బరీ తోటల పెంపకం, పొలం గట్ల వెంబడి గడ్డి పెంపకం కూడా చేసుకోవచ్చునన్నారు. అంతే కాక వర్షపు నీటి నిల్వ పనులు, పొలాలకు ఒండ్రు మట్టి సారవంత పనులు, పూడిక తీత పనులు చేపట్టవచ్చన్నారు. పశువులు, మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణ పనులు ఉపాధి హామీ ద్వారా అమలవుతున్నాయన్నారు. క్లస్టర్ పరిధిలో పని చేసే క్షేత్ర, సాంకేతిక సిబ్బంది గ్రామాల్లోని రైతులకు, కూలీలకు ఈ పథకాలపై అవగాహన కల్పించి కూలీల పని దినాల సంఖ్యను పెంచేలా ప్రణాళిక రూపొందించాలని వివరించారు.

మాజీ ఎంపీపీని పరామర్శించిన అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): మాజీ ఎంపీపీ దాయరి లక్ష్మీ కాంతమ్మ ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేక పోవడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆదివారం పరామర్శించారు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగరంకు చెందిన మాజీ ఎంపీపీ దాయరి లక్ష్మీ కాంతమ్మ ఆరోగ్య పరిస్థితి దెబ్బతింది. దీంతో అశోక్‌బాబు ఆమెను పరామర్శించారు. తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గాదె శివరామకృష్ణా రెడ్డి, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లక్ష్మీ కాంతమ్మను పరామర్శిస్తున్న అశోక్‌బాబు

బేతపూడి సర్పంచ్ కుమారుడి మృతి

నివాళులర్పించిన ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: బేతపూడి సర్పంచ్ ఆలూరి పద్మ కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరి రవితేజ (32) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుడు రవితేజ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు రవితేజ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మండలి అంజయ్య, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఫరీద్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు రవితేజ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



ఆలూరి రవితేజ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి, నాయకులు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- ప్రారంభమైన మొహర్రం వేడుకలు
- పలు గ్రామాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు

భట్టిప్రోలు: హిందూ, ముస్లింలు కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఏటా మొహర్రం నెలలో నెలవంక కనిపించిన మూడో రోజు అంతవరకు పెట్టెల్లో భద్రపరచిన పీర్లను నిర్వాహకులు దించి చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. ఈ పది రోజులు ఉదయం, సాయంత్రం వేళల్లో పీర్లను ఊరేగిస్తారు. ఈ పర్వ దినాల్లో చివరి 3 రోజులు ముఖ్యమైనవి. పీర్ల ముందు అగ్ని గుండాలు ఏర్పాటు చేసి పీర్లను మోస్తూ అందులో నడుస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాము లందుకుంటాయి. అనంతరం సాయంత్రం అమరులైన వారిని ఊరేగించి రకరకాల వేషధారణలతో ఒకరిపైఒకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. గుండం కాలే రెండు రోజులు పానకం బిందెలు, పంచదార, బెల్లాన్ని పీర్ల వద్దకు తెచ్చి చదివింపులు ఇచ్చి నైవేద్యాన్ని అందరికి పంచి మొక్కులు తీర్చుకుంటారు. దీని వల్ల తమ కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. మండలంలో భట్టిప్రోలు, అద్దేపల్లి, పల్లెకోన గ్రామాల్లో హిందూ ముస్లింలు కలసికట్టుగా ఈ వేడుకలు నిర్వహిస్తారు.

మొహర్రం ప్రాధాన్యత..

ముస్లిం క్యాలెండర్ హిజీ ప్రకారం 12 మాసాల్లో మొహర్రం మొదటి నెల. ఈ నెలలో నెలవంక కనిపించిన 3వ రోజు నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇస్లాం మత ధర్మం కోసం దేవుని మార్గంలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తిగా హజరత్ ఇమామ్ హుస్సేన్ నిలిచాడు. మహ్మద్ ప్రవక్తముని మనవడైన ఆయనను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పండుగను పీర్ల పండుగ అని పిలుస్తారు. ఆదివారం నుంచి ఈ పండుగను జరపడానికి మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.



భట్టిప్రోలు ఓబిద్ మహల్లాలో ఏర్పాటు చేసిన పీర్లు



భట్టిప్రోలులో నిప్పుల గుండంలో పీర్లతో నడుస్తున్న భక్తులు(ఫైల్)

నిబద్ధతతోనే విధి నిర్వహణలో గుర్తింపు

తెనాలి అర్బన్: విధి నిర్వహణలో ఒడిదొడుకులు లేకుండా పదవీ విరమణ చేయటం చాలా సంతోషకరమని కొలకలూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. నిబద్ధతతోనే ఇలాంటి మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. కొలకలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1977–78లో పదో తరగతి చదివిన వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటైంది. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగ విరమణ చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మత్తె శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కర్నూల్ ఉన్నం ఎహెజ్కేల్, రేపల్లెలోని నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ జానీ బాషా, అకౌంట్స్ ఆఫీసర్ కాలిశెట్టి శ్రీనివాసరావులను గ్రామంలో ఘనంగా సన్మానించారు. చంద్రహాస్ అధ్యక్షత వహించగా, యాగ చంద్రశేఖర్, కింగర సాయి, బాలాజీ, శ్యామ్ సుందర్, మజీద్, వెంకట్రామయ్య, మల్లికార్జున, బసవశంకర్, విజయలక్ష్మి, ఝాన్సీ, శివపార్వతి, సామ్యూల్, నరసింహారావు, ఉషారాణి, మత్తే బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన విశ్రాంత ఉద్యోగులు

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే ఇసుక

తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

కొల్లిపర: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విధానంలో లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ద్వారా నమోదు చేసుకుంటేనే స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడ్ చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. రాష్ట్రంలో సోమవారం ఉచిత ఇసుక విధానం ప్రారంభం సందర్భంగా ఆదివారం సబ్ కలెక్టర్ కొల్లిపర, మున్నంగిలోని ఇసుక స్టాక్ పాయింట్‌లను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు సమన్వయంతో ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఇసుక కావాల్సి వారు బుకింగ్, చెల్లింపులు అంతా ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒక వ్యక్తి ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు మాత్రమే ఇసుక ఇవ్వనున్నట్లు తెలిపారు. కొల్లిపర స్టాక్ పాయింట్‌లో 33 వేల టన్నులు, మున్నంగిలో 1. 81 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద పోలీసులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవీంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు (సాయి), వీఆర్వోలు భాస్కర్, భాను, రామారావు, మండల సర్వేయర్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

వైఖానస పండితులకు నివాళి

తెనాలి రూరల్: ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు, వైఖానస ఆగమ పండితులు ఆర్ఎస్ గోపాలకృష్ణ, వైకుంఠపురం దేవస్థానం పాకయాజి రత్నాకరం రంగనాథాచార్యులుకు నివాళులు అర్పించారు. వారి సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాత్రికేయ రంగంలోనే కాకుండా సంస్కృత, తెలుగు భాషలతోపాటు వైఖానస ఆగమంలో కూడా ప్రావీణ్యాన్ని పొంది సమాజానికి సేవలందించిన మహా వ్యక్తి గోపాలకృష్ణ అని కొనియాడారు. వైకుంఠపురం దేవస్థానంలో పాకయాజిగా పనిచేస్తూ వైఖానస, అర్చక సంఘాలకు రంగనాథాచార్యులు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల విరాళం

వేమూరు: అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు రూ.20 వేలు అందించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు విశ్రాంతి ఉపాధ్యాయులు జి శాంత కుమారి రూ.10 వేలు, ఒకేషనల్ ఉపాధ్యాయుడు ఎం గిరిధర్ ప్రసాద్ రూ.10 వేలు అందించారు. పాఠశాలలోని స్టాఫ్ రూమ్ వర్షా కాలంలో లీక్ కావడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాల అభివృద్ధికి విరాళం అందించిన దాతలకు ఆయన కృతజ్ఞత తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

రేపల్లెరూరల్: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని 3వ వార్డులో చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు వివరాల మేరకు 3వ వార్డుకు చెందిన బాలాజీ పూరిల్లు ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయన్నారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశామన్నారు. రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. ప్రమాదానికి కారణాలు తెలియరావాల్సి ఉందన్నారు.

నందివెలుగులో ఉచిత వైద్యశిబిరం

తెనాలి రూరల్: తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో గుంటూరుకు చెందిన ఆంధ్రా ప్రైమ్ హాస్పిటల్స్, గ్రామ ఎంపీటీసీ తిన్నలూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని అమ్మవారి ఆవరణలో బొడ్డు వెంకట సుబ్బయ్య కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 350 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు అచ్చంశెట్టి అన్వేష్ కుమార్, జల్లెపల్లి తేజస్వి, కాసుల సాయి రాజశేఖర్, పవన్ బడుగు, జి.మాధవీలత, మంగిశెట్టి విజయకృష్ణ, రీనా, సాగర్, బూసిరెడ్డి విశ్వ, దేదీప్య వైద్యసేవలు అందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ

తెనాలి అర్బన్: తెనాలి పట్టణ మేదరి సంఘం ఆధ్వర్యంలో గెయిటీ థియేటర్ వద్ద ఆదివారం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ మేదరి సంఘ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోడే నాగేశ్వరరావు, జే నాగమోహన్, కే రాంబాబు, చందు శరత్ బాబు, కోనా రాఘవులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.